క్లుప్తంగా

ఆలయంలో చండీ హోమం



పెనమలూరు:యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో నాల్గవ శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివార్ల పంచామృతాభిషేకం చేసి అలంకరణ చేశారు. అనంతరం భక్తులచే చండీ హోమం, రుద్రహోమం చేశారు. మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. ఆలయ అర్చకుడు జీఆర్‌వీ సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు, ఈవో ఎం.గంగాధరరావు పాల్గొన్నారు. పార్వతీ రామలింగేశ్వరస్వామి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు అందచేశారు.

విద్యాభివృద్ధికి రోటరీ ట్రస్టు చేయూత



ఉయ్యూరు: విద్యాభివృద్ధికి రోటరీ తమ వంతు చేయూత అందిస్తుందని కేసీపీ యూనిట్ హెడ్ వై.సీతారామదాసు అన్నారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో రోటరీ కమ్యూనిటీ సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో విద్యా ప్రోత్సాహకాల కింద ఇంజినీరింగ్ విద్యార్థినులు భావన, యజ్ఞశ్రీలకు రూ.30 వేలు చెక్కును శుక్రవారం అందించారు. విద్యార్థినుల కుటుంబాలకు ఆ చెక్కును అందించి పేదలకు ఎప్పుడూ తోడ్పాటుగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి సీకె వసంతరావు, ప్రతినిధులు సంపత్‌కుమార్, నాగసుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

12 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్

పెనమలూరు: ఈ నెల 12వ తేదీ నుంచి మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నామని ఎంఈఓ 1 శేషగిరిరావు తెలిపారు. 12, 13వ తేదీల్లో స్కూల్ గేమ్స్ గంగూరు నలందా స్కూల్లో నిర్వహిస్తామన్నారు. పోటీల అనంతరం సెలక్షన్లు ఉంటాయన్నారు. పోటీలు 9 విభాగాల్లో జరుగుతాయన్నారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, షటిల్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు మండల స్థాయిలో నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఉంటాయని తెలిపారు.

పెనమలూరు సీఐగా రామారావు



పెనమలూరు: సీఐగా టీవీవీ రామారావును నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేసిన ఎం.కిషోర్‌బాబు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన స్థానంలో ప్రస్తుతం కంకిపాడు సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు ఇన్‌చార్జిగా ఉన్నారు. తాజాగా నూతన సీఐ రామారావును నియమించారు. గతంలో రామారావు ఉయ్యూరు రూరల్ సీఐగా పని చేశారు. 2019 లో బదిలీ అయ్యి నిఘా విభాగంలో విధులు నిర్వహించారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

పెనమలూరు:పోరంకి -నిడమానూరు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోరంకి యాదవుల బజార్‌కు చెందిన పల్లపు నాగేంద్రబాబు, కంబాల శ్రీను, వేముల వినయ్ నిడమానూరు రోడ్డులో పోరంకి వైపుకు బైక్ పై వస్తుండగా ఎదురుగా వచ్చిన కారు వారి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న ముగ్గురు వ్యక్తులు రోడ్డు పై పడిపోవటంతో గాయాలయ్యాయి. వారిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు:వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారి పై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోరంకి సుగాలికాలనీకి చెందిన హర్షిత గత 2020 సంవత్సరం ఫిబ్రవరిలో రంజిత్‌కుమార్ అనే వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. భర్త హైదరాబాద్‌లో మెకానిక్‌గా పని చేస్తాడు. వీరికి ముగ్గురు పిల్లలు. హర్షితకు ఉద్యోగం రావటంతో హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. కాగా ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత మూడవ కాన్పు వద్దని భర్త అభ్యంతరం చెప్పాడు. అయితే మూడవ కాన్పులో పాపకు జన్మ నిచ్చింది. అప్పటి నుంచి కటనకానుకలు కావాలని భర్తతో పాటు అత్త లక్ష్మి, మామ నాగేశ్వరరావు, మరిది అజేష్‌లు వేధించటంతో పెద్దల సమక్షంలో చర్చలు జరిపారు. అయినా వారిలో మార్పు రాకుండా కట్నం కోసం వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఆశ్రయించింది. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షేమ ఫలాలతో పేదల జీవితాల్లో వెలుగు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని మూడో వార్డు పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సాయిమహల్ సెంటరు, ఫైర్‌స్టేషన్ రోడ్డు, శ్రీలంక కాలనీ ఏరియాల్లో ఎమ్మెల్యే పార్థసారథి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని సంక్షేమ పాలనపై ప్రజాభిప్రాయం సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ఏ ఇంటికి వెళ్లి అడిగినా జగనన్న తమకు అన్నీ ఇస్తున్నాడని సంతోషంగా చెబుతున్నారని పేర్కొన్నారు. ఎక్కడా కూడా తమకు పథకాలు అందటం లేదని చెప్పలేదన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా భావించి ప్రజాజీవితాల్లో వెలుగులు నింపుతున్నామని తెలిపారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో అరాచకాలు చేశారని ఆరోపించారు. అర్హతలను పక్కనపెట్టి అయినోళ్లకు దోచిపెట్టారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో అర్హతే కొలమానంగా పథకాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, ఆ వార్డు కౌన్సిలర్ తెనాలి పద్మావతి, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు బజారు చిరంజీవి, ఈడుపుగంటి బాలాజీ, తిరుమలరావు, అవినాష్, తెనాలి విజయ్, సాయిమహల్ సెంటరు యూత్, పలువురు ప్రజాప్రతినిధులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఊరూరా కొత్త పింఛన్ల పండుగ



మంతెనలో కొత్త పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులు



గొడవర్రులో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్

కంకిపాడు: ఊరూరా కొత్త పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలో సాగింది. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ ఆదేశాలతో సెప్టెంబరు నెల నుంచి కొత్తగా మంజూరైన పింఛన్లను శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని 20 గ్రామాల్లో గత నెల వరకూ 8985 మంది పింఛన్లు అందుకుంటున్నారు. సెప్టెంబరు నెల నుంచి తొలి విడతలో 204 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. వీటితో కలిపి 9189 మంది పింఛన్లు విడుదలయ్యాయి. కొత్త పింఛన్లను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. వలంటీర్లు, గృహసారధులు పర్యవేక్షణలో పింఛను సొమ్ము అందజేశారు. పునాదిపాడు సచివాలయంలో శుక్రవారం కొత్త పింఛన్ల పంపిణీ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు పింఛన్లు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. గొడవర్రు గ్రామ పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను, సంక్షేమ పాలనను వివరించారు. మంతెన గ్రామ పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బండి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ పటాకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ



ఆకునూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



తాడిగడప పాఠశాలలో అక్షరాస్యతా దినోత్సవం నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

ఉయ్యూరు: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని ఆకునూరు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం ఎస్.సలోమి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు అక్షర నమూనాలను చేతబట్టి అక్షరాస్యత ఆవశ్యకత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, కార్యదర్శి నల్లా శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడిగడపలో అక్షరాస్యతా దినోత్సవం

పెనమలూరు: తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం ఘనంగా చేశారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్య పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా ఫాతిమా మాత వేడుకలు

ఉంగుటూరు: మండలంలోని పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్‌తంబి పుణ్యక్షేత్రంలో ఫాతిమా మాత వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన మరియమాత తేరు ప్రదక్షణ తెల్లవారుజామున ముగిసింది. తొమ్మిది రోజులు నవదిన ప్రార్ధనలు జరిగాయి. ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా ప్రొవెన్షియల్ ఫాదర్ ప్రత్తిపాటి మరియదాసు దివ్య పూజాబలి సమర్పించారు. మరియ తల్లి జీవితాన్ని వివరించారు. కార్యక్రమంలో ఫాదర్లు జోసఫ్, అభిలాష్, మఠకన్యలు, కథోలిక విశ్వాసులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలతో రైతు ముంగిటకే సేవలు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు

ఉయ్యూరు: ఆర్‌బీకేల ద్వారా రైతుల ముంగిటకే ప్రభుత్వం సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, సమస్యలపై సమావేశంలో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఆర్‌బీకేల్లో యూరియా, పొటాష్ అందుబాటులో ఉంచాలని సూచించారు. సెప్టెంబరు 15లోగా ఈ క్రాప్ నూరు శాతం పూర్తికావాలని కోరారు. డొంక రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పశువుల బీమా సొమ్ము జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జలకళ కింద వేసే బోర్లకు విద్యుత్ సరఫరా ఏర్పాటుచేసి మోటర్లు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో సలహా మండలి పెనమలూరు నియోజకవర్గ సభ్యుడు గొల్లపూడి వేణుబాబు, ఎంపీడీఓ విమాదేవి, ఏఓ నిస్సిగ్రేస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ



కంకిపాడు: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సీహెచ్‌సీ చైర్మన్ మేడంద్రావు కుటుంబరావు అన్నారు. మదర్‌థెరిస్సా సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 50 మంది నిరుపేదలకు ఆహార పొట్లాలను శుక్రవారం పంపిణీ చేశారు. సామాజిక సేవలో మదర్‌థెరిస్సా సాంఘిక సేవా సంస్థ పనితీరు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి తాడితోటి నరసింహారావు, గాడ్ హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు ఎంఎస్ రాజు, దళిత ఫోరం నాయకులు వర్రె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కృష్ణాష్టమి వేడుకలు



కంకిపాడు: కృష్ణాష్టమి వేడుకలు రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. మంతెన గ్రామంలో శ్రీకృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రెండో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువత, చిన్నారులు ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని జరిపించారు. కమిటీ పర్యవేక్షణలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమాన్ని సర్పంచ్ వీరంకి వెంకట రమణ, ఎంపీటీసీ బండి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ పటాకుల శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు గోగం రంగారావు, చేబోయిన రంగా, చిమటా కోటేశ్వరరావు, నగుళ్ల సురేష్, గోగం రామకృష్ణ, రాజులపాటి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ప్రొద్దుటూరు గ్రామంలో యువత ఆధ్వర్యంలో గురువారం రాత్రి కృష్ణాష్టమి పర్వదినం ఘనంగా జరిపించారు.

మండల స్థాయి బాలుర జట్ల ఎంపిక



ఉయ్యూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి బాలుర జట్ల ఎంపిక పూర్తయింది. స్థానిక జెడ్పీ పాఠశాలలో అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, యోగలో జట్ల ఎంపికలో పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఎంపిక చేసి మండల స్థాయి జట్లను సిద్ధం చేశామని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జీవీ రమణ తెలిపారు. పోటీలను పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్‌రావు, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ఎంపికైన జట్లు నియోజకవర్గ స్థాయిలో ఉయ్యూరు మండలం తరపున పోటీ పడతారని తెలిపారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



సామూహిక వ్రతాల్లో మహిళలు



మానుకు పూజలు చేస్తున్న భక్తులు

రామవరప్పాడు: రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణ మాసం నాలుగో శుక్రవారం పురస్కరించుకుని ఆలయ అర్చకుడు ఇనుగంటి లక్ష్మీనరసింహశర్మ సమక్షంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. సుమారు 100 మంది మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతం చేశారు. పూజా సామగ్రిని ఆలయ సిబ్బంది భక్తులకు అందజేశారు. వ్రతం అనంతరం భక్తులకు రవిక, గాజులు, తాంబూలం ప్రసాదంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఆలయ ఈవో పి.లోకేశ్వరి, ధర్మకర్తల మండలి సభ్యులు మత్తె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో నాలుగో శుక్రవారం సందర్భంగా లక్ష గులాబీలతో అర్చన జరిపారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మి)కి భక్తులు పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పొంగళ్లను అమ్మవారికి సమర్పించారు. భక్తులు శ్రీలక్ష్మి, శ్రీలలితా సహస్రనామ పారాయణం చేశారు. జాస్తి సీతయ్యచౌదరి, అనంతలక్ష్మీవిజయకుమారి దంపతులు, పమిడిముక్కల వెంకటప్రసాద్, సృజన దంపతుల సౌజన్యంతో అమ్మవారికి లక్ష గులాబీ పూలతో అర్చన జరిగింది. శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ ఉత్సవమూర్తులకు చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది.

230 మందికి ఉచిత వైద్య పరీక్షలు



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

గన్నవరం రూరల్: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని గోపవరపుగూడెం సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గ్రామంలోని ఎంపీపీ పాఠశాల సమీపంలో క్రాన్ గాస్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ట్రస్టు సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యం కోసం వేల కోట్లు ఖర్చు చేస్తోందని, అందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తోందని చెప్పారు. ప్రభుత్వం ఆశయానికి అనుగుణంగా స్వచ్ఛంద సంస్థలు గ్రామాల్లో ప్రజారోగ్యంపై మరింత విస్తృత అవగాహన కల్పించటం శుభ పరిణామమని చెప్పారు. ట్రస్టు చైర్మన్ ఆవుటపల్లి రమేష్‌పాల్, సంస్థ డైరెక్టర్‌లు ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహణకు కృషి చేయటం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా 230 మందికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. త్రివేణి ఫార్ములేషన్స్ సీఈవో పర్వతనేని శ్రీనివాసరావు, డాక్టర్లు సూరెడ్డి అరవింద్, కళ్యాణి, సౌమ్య, దేవి, శ్రీకర్ తదితరులు, సిబ్బంది వైద్య సేవలందించారు. వార్డు సభ్యులు, వలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎరువుల కొరత రాకుండా ప్రత్యేక దృష్టి




సమావేశంలో ఎంపీపీ, కమిటీ సభ్యులు

గన్నవరం: ఎరువులు కొరత రాకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ అనగాని రవి సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి కమిటీ సమావేశం చైర్మన్ కాసరనేని గోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ వ్యవసాయ సంబంధిత ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. రైతులకు ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు, టార్పాలిన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పురుషోత్తపట్నంలో వచ్చే సీజన్‌లో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్ఎల్ తేజస్వి మాట్లాడుతూ మండలంలో ఈ క్రాప్ నమోదు 52 శాతం పూర్తైందని తెలిపారు. పురుషోత్తపట్నం శివారు వీఎస్ పురంలో ఈ క్రాప్ నమోదుకు ఎదురవుతున్న ఇబ్బందులను రెవెన్యూ శాఖ పరిష్కరించాలని కోరారు. కమిటీ సభ్యులు పామర్తి మాదవ్, తహసీల్దారు సీహెచ్ నరసింహారావు, ఎంపీడీఓ ఇ.సత్యకుమార్, ఎలక్ట్రికల్ ఏఈ ఎం.వెంకటరాజు, పశుసంవర్ధక శాఖకు చెందిన డాక్టర్ సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు


పెనమలూరు:యనమలకుదురులో 8 మంది పేకాటరాయుళ్లను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కృష్ణానది వద్ద పేకాటాడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ శేషుకుమార్ ఆధ్వర్యంలో దాడి చేయగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.4350 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అలానే గ్రామంలోని నది పరివాహక ప్రాంతంలో పేకాటాడుతున్న మరో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద రూ.3500 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు.

రైతులకు వ్యవసాయ కనెక్షన్లు



నున్న(విజయవాడరూరల్): వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సకాలంలో ఇస్తామని నున్న ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ అసిస్టెంటు ఇంజినీర్ ఎం.రాజశేఖర్ అన్నారు. నున్న గ్రామం రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన సలహా మండలి సమావేశం జరిగింది. ఎలక్ట్రికల్ ఏఈ రాజశేఖర్ మాట్లాడుతూ నున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో 1,85 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, కొత్తగా దరఖాస్తు చేసుకునే రైతులకు సకాలంలో కనెక్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రోజు 9 గంటల పాటు వ్యవసాయ పంటలకు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. నాగిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లో ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను పొందడానికి సాగు చేస్తున్న వారు తప్పకుడా ఈక్రాప్ నమోదు చేయాలన్నారు. మేకలకు, గొర్రెలు, ఆవులకు వ్యాక్సినేషన్లు వేస్తున్నామని పశుసంవర్ధకశాఖ డాక్టర్ ప్రసన్న తెలిపారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందజేసే రాయితీలను ఉద్యానశాఖాధికారి పరమేశ్వర రెడ్డి తెలియజేశారు. సమావేశంలో ఏడీ వెంకటేశ్వరరావు, ఏఓ రంగనాథ్‌బాబు, ఏఈఓ సురేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజారావు సేవలు మరువలేనివి



పెనమలూరు:పేదల హక్కుల కోసం కళాకారుడు గరికపాటి రాజారావు అందించిన సేవలు ఎన్నటికీ మరువలేనివని ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ అన్నారు. గరికపాటి రాజారావు వర్ధంతి సందర్భంగా పోరంకిలో శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజానాట్య మండలి స్థాపించి ప్రజలను చైతన్యం చేసి హక్కుల కోసం రాజారావు పోరాటం చేశారన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గరికపాటి రాజారావు ఆశయాలు నెరవేర్చడానికి నేటి యువత కృషి చేయాలన్నారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి షేక్.కాశిం, సీపీఐ నేతలు మేరుగ విజయ్‌కుమార్, మున్నంగి నరసింహారావు, అనుమోలు ఆదరణ చైర్మన్ అనుమోలు ప్రభాకర్‌రావు, సీఐటీయు నేతలు ఉప్పాడ త్రిమూర్తి, లక్ష్మి, లక్ష్మీనారాయణ, పల్లా పాపారావు పలువురు పాల్గొన్నారు.